క్లుప్తంగా

పాలిసెట్‌లో ప్రతిభ


అనాస్

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎస్‌కే హుస్సేన్–మైముద దంపతుల కుమారుడు ఎస్‌కే.అనాస్ పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. శనివారం విడుదల పాలిసెట్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో 120 మార్కులకు గానూ 113 సాధించి రాష్ట్రస్థాయిలో 108వ ర్యాంక్ సాధించాడు. దీంతో అనాస్‌ను గ్రామస్తులు అభినందించారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో రమాదేవి

తానూరు: మండలంలోని వడ్గాం గ్రామంలో ఆదివారం పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ పార్టీ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రమాదేవి గ్రామస్తులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు రైతుభరోసా, పెట్టుబడిసాయం అందని పరిస్థితి నెలకొందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, కృష్ణారెడ్డి, బాలాజీ, సాయినాథ్, అంజనాబియి తదితరులు ఉన్నారు.

నల్లపోచమ్మ పండుగ

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్‌లో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో నల్లపోచమ్మ పండుగ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పందుల సంచారంతో రోగాలు

కుంటాల: మండలకేంద్రంలో సంచరిస్తున్న పందులతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఓ ప్రకటనలో తెలిపారు. వారం రోజుల్లోగా పందులను గ్రామంలోకి రాకుండా యజమానులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే పందులను జంతు సంరక్షణ కమిటీకి అప్పగిస్తామని పేర్కొన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు తిరంగా యాత్ర


ఖానాపూర్: ఆపరేషన్ సిందూర్ దిగ్విజయ యాత్రలో భాగంగా సైనికుల ధైర్యసాహసాలకు కృతజ్ఞతగా ఖానాపూర్‌లో సోమవారం నిర్వహించే తిరంగా యాత్రకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ కాసవేణి ప్రణయ్ కోరారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి నిర్వహించే యాత్రను జయప్రదం చేసేందుకు ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల ప్రజలు, పార్టీలకతీతంగా నాయకులు రావాలని కోరారు.

‘భూభారతి’ దరఖాస్తులు పరిశీలన


దరఖాస్తులు పరిశీలిస్తున్న డీటీ నరేశ్‌గౌడ్

కుంటాల: భూభారతిలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో అందించిన దరఖాస్తులను పరిష్కరిస్తామని డీటీ నరేష్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, సిబ్బంది రాహుల్, ప్రసాద్, సాయన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాల లారీ బోల్తా



లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రం నుంచి తూకం వేసిన 740 ధాన్యం బస్తాలను తీసుకెళ్తున్న ఓ లారీ లక్ష్మణచాంద ఊర చెరువు కట్టపై ఆదివారం సాయంత్రం బోల్తాపడింది. వివరాల్లోకి వెళితే.. మండలకేంద్రానికి చెందిన తుమ్మల సురేందర్‌రెడ్డి అనే రైతుకు చెందిన 650 బస్తాలు, కూన రవికి చెందిన 90 బస్తాలను మామడ రైస్‌మిల్లుకు తరలిస్తుండగా లక్ష్మణచాంద చెరువు కట్టపై నుంచి కిందకు వస్తుండగా లారీ బోల్తాపడింది. ఈ విషయం తెలిసి స్థానిక రైతులు అక్కడకు చేరుకున్నారు. దీనిపై ఏపీఎం వాణిశ్రీని ‘సాక్షి’ఫోన్‌లో సంప్రదించగా మరో లారీ ఏర్పాటు చేసి ధాన్యం బస్తాలను తరలిస్తామని పేర్కొన్నారు.



వెయిటింగ్ ఫర్.. మహాలక్ష్మి

కడెం: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణానికి తగ్గట్లు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కడెం, ఖానాపూర్, జన్నారం మండలాలకు బస్సులు తక్కువ ఉండటంతో ప్రజలు ఇలా నిత్యం బస్టాప్‌ల వద్ద వేచి చూస్తున్నారు. కడెం బస్టాప్‌లో ప్రయాణికులు వేచిచూస్తున్న దృశ్యమిది.

దివి నుంచి భువికి వస్తున్నట్లుగా..


పొట్టపల్లిలో వద్ద నేలను తాకినట్లుగా మేఘాలు

లక్ష్మణచాంద: అకాల వర్షాల కారణంగా కొద్దిరోజులుగా ఆకాశంలో ఏర్పడుతున్న మేఘాల చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం సాయంత్రం మండలంలోని పొట్టపల్లిలో నేలను, పార్‌పెల్లి చెరువు కట్టను తాకుతున్నట్లు మేఘాలు కన్పించాయి. దివి(ఆకాశం) నుంచి భువి(నేల)పైకి వస్తున్నట్లు కన్పించిన మేఘాల దృశ్యాలు స్థానికులకు ఆహ్లాదం పంచాయి.


డ్రెయినేజీ నిండి రోడ్డుపై చేరిన మురుగునీరు

చిన్నపాటి వర్షానికే ఇలా..

భైంసాటౌన్: పట్టణంలోని డ్రెయినేజీల్లో పూడిక తొలగించకపోవడంతో చిన్నపాటి వర్షానికే మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. ఆదివారం స్థానిక గణేశ్ నగర్‌లో కుభీర్ రోడ్డులో కోతిదేవుడి ఆలయ సమీపంలో డ్రెయినేజీ నిండి రోడ్డుపై భారీగా వర్షపు నీరు, మురుగునీరు చేరింది. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీల్లో పూడిక తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నాసిరకంగా డివైడర్ పనులు



మచ్‌కల్ వెళ్లే మార్గంలో అప్రోచ్ రోడ్డు వేయకుండా ఇలా..



నాణ్యత చూసి నవ్వుకునేలా!


పిప్రి సమీపంలో కుంగిపోయిన రోడ్డు

- రూ.కోట్లతో పనులు.. అప్పుడే పగుళ్లు
- నాసిరకంగా 161బీబీ హైవే పనులు
- గ్రామాలకు అప్రోచ్ రోడ్లు కరువు
- పట్టించుకోని అధికారులు

భైంసాటౌన్: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 161బీబీ హైవే పనుల్లో నాణ్యత నగుబాటుగా మారింది. హైదరాబాద్–నర్సాపూర్–బాన్సువాడ–బోధన్–బాసర–భైంసా వరకు చేపడుతున్న ఈ రోడ్డుకు 161బీబీ జాతీయ రహదారిగా నామకరణం చేశారు. ఇందులో బోధన్ నుంచి భైంసా వరకు 56 కిలోమీటర్ల మేర రెండు వరుసల రోడ్డు(10 మీటర్ల వెడల్పు)ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.644కోట్లు మంజూరు చేయగా 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ పనులకు శంకుస్థాపన చేశారు. రెండు జిల్లాలను కలిపే ఈ హైవే పూర్తయితే బాసరలోని శ్రీ సరస్వతి ఆలయం మొదలు, ఆర్జీయూకేటీ, భైంసాలో పత్తి పరిశ్రమలతోపాటు ఈ ప్రాంతం ఆధ్యాత్మిక, విద్యా, పారిశ్రామిక, పర్యాటక, రవాణాపరంగా అభివృద్ధి చెందుతుంది.

కనిపించని అప్రోచ్ రోడ్లు...

నిబంధనల ప్రకారం హైవే వెంట ఉన్న గ్రామాలలోనికి వెళ్లేందుకు హైవే నుంచి వంద మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించాలి. కానీ హైవే వెంట ఉన్న గ్రామాలకు అప్రోచ్‌రోడ్లు వేయలేదు. ఇటీవల దేగాం గ్రామం వద్ద వాలేగాం వెళ్లే మార్గంలో రోడ్డు సరిగా లేకపోవడంతో జొన్నల లోడ్‌తో వెళ్తున్న లారీ కూరుకుపోయింది. ఇలేగాం, బడ్‌గాం, మచ్కల్, సరస్వతినగర్, ముద్గల్, పిప్రి, తరోడ(చించాల), టాక్లి గ్రామాలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాలి. కానీ కొన్నిచోట్ల మెటల్(కంకర) వేసి వదిలేయడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్నారు. రోడ్డు వెంట ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు.

కోతకు గురవుతున్న గట్లు..

హైవే వెంబడి పలు చోట్ల కల్వర్టులు నిర్మించారు. కల్వర్టుకు ఇరువైపులా స్టోన్ పిచింగ్ వేయాలి. కాగా కొన్నిచోట్ల బండరాళ్లు పరిచి పిచింగ్ చేశారు. మరికొన్ని చోట్ల అలాగే వదిలేశారు. దీంతో ఆయా చోట్ల వర్షపునీటికి కల్వర్టు గట్లు, రోడ్డు కోతకు గురవుతున్నాయి. సీసీ పనులకు సంబంధించి సరైన క్యూరింగ్ చేయకపోవడంతో పగుళ్లు ఏర్పడుతున్నాయి. రెయిలింగ్, ఫుట్‌పాత్‌పై పార్కింగ్ టైల్స్ పనులు సైతం తూతూమంత్రంగా చేపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు నాణ్యతతో చేపట్టేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

రూ.కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైవే పనులను గుత్తేదారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొన్నిచోట్ల నాసిరకంగా పనులు చేయడంతో పగుళ్లు ఏర్పడుతున్నాయి. పనులు ప్రారంభించి దాదాపు రెండేళ్లు కావొస్తున్నా.. ఇప్పటికీ కొన్నిచోట్ల అసంపూర్తిగా వదిలేశారు. భైంసా మండలం దేగాం, ముధోల్ మండలం తరోడ, బాసర మండలం బిద్రెల్లి వద్ద రోడ్డు పనులు, రహదారి పక్కన డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేయలేదు. రహదారి మధ్యలో డివైడర్ పనులు నాసిరకంగా చేపట్టడంతో పగుళ్లు ఏర్పడుతున్నాయి.

పనులు నాణ్యతగా చేపడతాం

హైవే పనులు ఇంకా కొనసాగుతున్నాయి. గ్రామాలకు అప్రోచ్‌రోడ్లు నిర్మిస్తాం. కల్వర్టుల వద్ద స్టోన్ పిచ్చింగ్ కూడా చేయిస్తాం. డివైడర్ పనుల్లో నాణ్యత పరిశీలిస్తాం. పనులు నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– బి నరేశ్‌కుమార్, డీఈఈ, నేషనల్ హైవే(బాసర)

‘మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి’


సీఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న సురేశ్

ఖానాపూర్: గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ విధానం రద్దు చేసి జీవో నెంబర్ 51ను సవరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సత్తనపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. మేడే స్ఫూర్తితో కార్మికులు ఉద్యమించాలన్నారు. కార్మికులకు కేటగిరిల వారీగా ఉద్యోగ హోదా కల్పించి పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలను విడుదల చేయాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల ఏర్పాటు పనులు చేసే కార్మికులను ప్రభుత్వం మల్టీపర్పస్ విధానంతో పని చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కమల, స్వప్న, శేఖర్, పోశెట్టి, వెంకటేష్, స్వామి, లక్ష్మి, రవి తదితరులు ఉన్నారు.

కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు


ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

ఖానాపూర్: వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయకుండా వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని ఖానాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజిద్.. నిర్వాహకులకు సూచించారు. ఆదివారం మండలంలోని రాజురా గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ఆందోళన చెందవద్దని తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజురా సత్యం, చిన్నం రవీందర్, సంజీవ్, నారాయణరెడ్డి, నిమ్యానాయక్ తదితరులు ఉన్నారు.

ఆదమరిస్తే..అంతే!


ప్రమాదకరంగా కాలువ గుంత


కాలువలో కూరుకుపోయిన లారీ

కడెం: మండలంలోని కొండుకూర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట కాలువ గుంత ప్రమాదకరంగా మారింది. రహదారిని ఆనుకుని పొదల చాటున ఉండటంతో దగ్గరకు వచ్చే వరకు వాహనదారులకు కనిపించడం లేదు. ఇటీవల ఓ లారీ సైతం ఈ కాల్వలో కూరుకుపోయింది. అధికారులు.. కల్వర్టు నిర్మించి ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

బురద రోడ్లతో ఇబ్బందులు


పంచగుడిలో ప్రధాన రోడ్డు దుస్థితి


ధర్మోరలో..

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపునీరంతా రోడ్డుపైనే నిలిచి బురదమయంగా మారుతోంది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచగుడి నుంచి నిజామాబాద్ జిల్లాకు వెళ్లే రోడ్డు, ధర్మోర నుంచి ముధోల్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు బురదమయంగా మారింది. నిత్యం గోదావరి నల్లమట్టిని ఇతర గ్రామాలకు తరలిస్తుండగా రోడ్డుపై పడి బురదకు కారణమవుతోంది. అధికారులు స్పందించి రోడ్డుపై బురద నిలవకుండా మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మూగజీవాల ఉసురు తీసిన కరెంట్

ముధోల్: మండలంలోని వడ్తాల గ్రామంలో దేవ్‌రావుపటేల్‌కు చెందిన గేదె ఆదివారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. గ్రామ శివారులో మేత మేస్తూ ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ వైరుకు తగలడంతో అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని.. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

మామడ: మండలంలోని కొరిటికల్ గ్రామంలో బాల్కొండ రమేశ్‌కు చెందిన గేదె ఆదివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేలకు పైనే ఉంటుందని..విద్యుత్ అధికారులు పరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు.


కొరిటికల్‌లో గేదె కళేబరం వద్ద బాధితుడు


మృతిచెందిన ఆవు వద్ద భోజన్న

భైంసారూరల్: మండలంలోని పెండ్‌పెల్లిలో రెండు ఆవులు విద్యుత్‌షాక్‌తో ఆదివారం మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సమీపంలోని సుద్దవాగు వద్ద విద్యుత్ సరఫరా అవుతున్న తీగలు తెగిపడ్డాయి. గ్రామానికి చెందిన భోజన్న, శ్రీనివాస్ అనే రైతులకు చెందిన రెండు ఆవులు మేత మేస్తూ ఈ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. ప్రభుత్వం తరఫున పరిహారం అందించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి


షేక్ మైమ్మూద్(ఫైల్)

ముధోల్: మండల కేంద్రంలోని నయాబాది కాలనీకి చెందిన షేక్ మైమ్మూద్ విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. సీఐ మల్లేశ్ వివరాల ప్రకారం.. శనివారం రాత్రి ఇంటి వద్ద మైమ్మూద్(39) కూలర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో కింద పడిపోయాడు. వెంటనే కుటుంబీకులు అతడిని భైంసా ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

కుంటాల: అకాల వర్షాల నేపథ్యంలో రైతులను ఇబ్బంది పెట్టొద్దని డీటీ నరేశ్‌గౌడ్.. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆదివారం కుంటాలలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. త్వరితగతిన ధాన్యాన్ని తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సిబ్బంది రాహుల్ తదితరులు ఉన్నారు.

మన్‌కీ బాత్ వీక్షణ


ఖానాపూర్: కార్యక్రమాన్ని వీక్షిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌లో ఆదివారం ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్ ఆధ్వర్యంలో 236, 237 బూత్‌లకు చెందిన నాయకులు టీవీలో వీక్షించారు. బాదనకుర్తి గ్రామంలోని 251 బూత్ నాయకులూ కార్యక్రమాన్ని తిలకించారు. రవీందర్‌రెడ్డి, ఉపేందర్, మనోజ్, రమేశ్, సురేందర్, గిరి, భూమన్న, స్వామి, లింబాద్రి, సాయి, సుమంత్, ప్రశాంత్, రాకేశ్, వినోద్ తదితరులున్నారు.

కడెం: మండలంలోని ఉడుంపూర్‌లో బీజేపీ నాయకులు మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కాశవేణి శ్రీనివాస్‌యాదవ్, బూత్ కమిటీ అధ్యక్షుడు అచ్చె రాజన్న, కొట్టె శేఖర్, మెంగాని శంకరయ్య, కొంపెల్లి తిరుపతి, సాయి గౌడ్ తదితరులున్నారు.

ఘనంగా మందపోచమ్మ పండుగ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గొల్లపేట్ చెరువు పక్కన ఆదివారం మంద పోచమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. పశువుల మంద స్థలంలో బీసీ, ఎస్సీ కుల సంఘాల నాయకులు, సభ్యులు ఏటా వర్షాకాలంలో మంద పోచమ్మ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. నాయకులు శ్యామకూర భూమన్న, ఆనంద్, గంగన్న, సత్యనారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోజంతా విద్యుత్ వెలుగులే..



వెలుగుతున్న విద్యుత్ దీపాలు

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ గ్రామ వీధుల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా వీధిదీపాలు రోజంతా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో పంచాయతీకి బిల్లులు పెరగడంతోపాటు నిరంతరం వెలగడం ద్వారా బల్బులు దెబ్బతింటున్నాయి.